సాక్షి చిత్తూరు

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



బడా స్మగ్లర్లు దొరికేదెన్నడో..?

కర్ణాటక నుంచి చిత్తూరు జిల్లాకు మద్యం తరలిస్తున్న బడా స్మగ్లర్ల కోసం పోలీసులు గాలిస్తున్నారు. - 8లో



చనిపోయినా వైద్యం

పసికందు చనిపోయినా వైద్యం అందించినట్టు డాక్టర్ నటించిన సంఘటన పుంగనూరు పట్టణంలో చోటుచేసుకుంది. - 8లో



విద్యుత్ సమస్యపై ఆందోళన

ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలను తొలగించాలని గుండ్లకట్టమంచి దళితవాడ వానులు ఆందోళన చేశారు. - 8లో

న్యూస్‌రీల్

అక్టోబర్ ఒకటిన హుండీ లెక్కింపు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అక్టోబర్ ఒకటో తేదీన హుండీలోని కానుకలను లెక్కించనున్నట్టు ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఉదయం 7 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

జలవనరుల శాఖా మంత్రి రేపు జిల్లాకు రాక

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం చిత్తూరు జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. మంత్రి సోమవారం ఉదయం 11 గంటలకు కుప్పం బ్రాంచ్ కెనాల్ టేక్ ఆఫ్ పాయింట్, కే 1 పంపింగ్ హౌసలను తనిఖీ చేస్తారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కుప్పం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు కుప్పం నుంచి రైలు మార్గాన విజయవాడకు బయలుదేరి వెళ్తారని కలెక్టర్ వెల్లడించారు.

ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా మునిశంకరయ్య

చిత్తూరు కార్పొరేషన్: రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ వ్యాల్యూ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా మునిశంకరయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం జిల్లా రిజిస్ట్రార్‌గా ఎవరినీ నియమించకపోవడంతో ఈయన ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగా అటెండర్ల నుంచి జూనియర్ సహాయకుల వరకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు.

పోలీసుశాఖలో 175 మందికి స్థాన చలనం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా పోలీసుశాఖలో 175 మంది అధికారులు, సిబ్బందిని బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే స్టేషన్‌లో ఐదేళ్లకు పైగా పనిచేస్తున్న ఏఎస్‌ఐ నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు ఉన్న ఉద్యోగులకు చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. పలు స్టేషన్లలో పనిచేస్తున్న 102 మంది కానిస్టేబుళ్లు, 59 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, వీఆర్‌లో ఉన్న 14 మంది ఏఎస్‌ఐలకు ఖాళీల ఆధారంగా బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఎస్పీ ఉద్యోగులతో మాట్లాడారు. పోలీసు శాఖలో నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ప్రజలకు పోలీసు శాఖపై మంచి అభిప్రాయం కలిగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నగరికి సీపీఐ నారాయణ రాక

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు–తచ్చూరు నేషనల్ హైవే రైతుల నిరసన కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పాల్గొంటారని ఆ పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల కార్యదర్శులు నాగరాజన్, మురళీ తెలిపారు. నగరి సమీపంలోని ఐనంబాకం వద్ద ఉన్న పాదిరి గ్రామం వద్ద ఆదివారం ఉదయం 10 గంటల నుంచి వంటావార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. హైవేలో రైతులు, ప్రజల కోసం సర్వీస్ రోడ్లు, సబ్‌వే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా రైతులు, సీపీఐ కార్యకర్తలతో కలిసి నిరసన తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కార్యాలయాల వద్ద బదిలీల సందడి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రమైన చిత్తూరులోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో బదిలీల సందడి నెలకొంది. ఈ నెల 22 లోపు బదిలీల ప్రక్రియ ముగించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉండడంతో శనివారం హడావిడి కనిపించింది. జెడ్పీ, డీపీఓ, ట్రాన్స్‌కో, రిజిస్ట్రేషన్, అటవీశాఖల కార్యాలయాల్లో అన్ని క్యాడర్ల ఉద్యోగులు, సిబ్బంది 300 మందికి పైగా బదిలీ కానున్నారు. ఈ క్రమంలో సంబంధిత కార్యాలయాల వద్ద ఉద్యోగులు సిఫార్సు లెటర్లతో కనిపించారు. అలాగే కోరుకున్న చోట పోస్టింగ్స్ కోసం కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు నుంచి జిల్లా అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. బదిలీల ప్రక్రియ ఆదివారం నాటికి దాదాపు పూర్తి చేయనున్నట్లు తెలుస్తోంది.

■ గంగవరం మండలానికి చెందిన రాజారెడ్డి తన భూమిని బ్యాంకులో తనఖా పెట్టేందుకు అన్ని రికార్డులూ సిద్ధం చేసుకున్నాడు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూమి తనఖా పెట్టాల్సి ఉంది. ఇందుకోసం అక్కడి సబ్ రిజిస్ట్రార్ 1–బీ తీసుకురమ్మని చెప్పారు. దీంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తన పొలానికి సంబంధించిన 1–బీ అడిగారు. ఆ గ్రామం రీసర్వే అయిన జాబితాలో ఉందని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే వరకు 1–బీ ఇవ్వడం కుదరదని చెప్పారు. దీంతో ఆ రైతు ఏమి చేయాలో అర్థంగాక బాధపడుతున్నాడు.

■ పలమనేరు మండలం ముసలిమొడుగు గ్రామానికి చెందిన పుష్పరాజ్ 1–బీ కోసం పదిరోజులుగా సచివాలయంతోపాటు తహసీల్దార్ కార్యాలయం వద్దకు తిరుగుతున్నాడు. మరో రైతు రమణయ్య తన కుమార్తెను హార్టికల్చర్ డిప్లొమా కోర్సులో రైతు కోటా కింద చేర్చేందుకు తనకున్న పొలం వివరాలను తెలిపే తాజా 1–బీ కావాలని అడిగాడు. వారి గ్రామంలో ఇదివరకే రీసర్వే జరిగినందున అధికారులు 1–బీ ఇవ్వడం కుదరదని చెప్పారు. దీంతో తన కుమార్తెను కళాశాలలో ఎలా చేర్పించాలో దిక్కుతోచక ఆ తండ్రి మదన పడుతున్నాడు. ఇది జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని పలువురు రైతుల పరిస్థితి.



రైతన్నలకు 1–బీ కష్టాలు

ఏదైనా బ్యాంకులో పంట రుణం లేదా వ్యక్తిగత రుణం తీసుకోవాలంటే తగిన పత్రాలు పెట్టాలి. రైతులకు అందుబాటులో ఉండేవి భూములు మాత్రమే. వారు తమ భూములకు సంబంధించి 1–బీని తహసీల్దార్ కార్యాలయాల్లో తీసుకుని బ్యాంకుల్లో చూపించి రుణాలు తీసుకుంటూ ఉంటారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రీ సర్వే చేసి భూ రికార్డులను డిజిటల్ చేసింది. ఈ భూములకు ఐడీ, క్యూఆర్ కోడ్‌లను రూపొందించింది. సబ్ డివిజన్ కాని సర్వే నంబర్లకు సబ్ డివిజన్ చేసి భూ హక్కు పత్రాలు పంపిణీ చేసింది. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ రికార్డులను హోల్డ్‌లో పెట్టింది. దీంతో తహసీల్దార్ కార్యాలయాల్లో 1–బీ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- హోల్డ్‌లో రీసర్వే చేసిన గ్రామాల రెవెన్యూ రికార్డులు
- చంద్రన్న ఏపీ రీసర్వే ప్రాజెక్టు అమలయ్యే వరకు సర్వీసుల నిలిపివేత
- బ్యాంకు రుణాలు, రెన్యువల్‌కు తప్పని తిప్పలు
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు

చిత్తూరు కలెక్టరేట్/పలమనేరు : భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు గత ప్రభుత్వం వైఎస్ఆర్ జగనన్న భూహక్కు, భూ రక్ష పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా అధునాతన టెక్నాలజీని వినియోగించి రీ సర్వే చేయించింది. చిత్తూరు జిల్లాలో మూడు దశల్లో గుర్తించిన భూములను సమగ్రంగా సర్వే పూర్తి చేసింది. అనంతరం రైతులు, ప్రజలకు శాశ్వత భూ హక్కు పత్రాలను పంపిణీ చేసింది. 100 ఏళ్ల తర్వాత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్వహించిన రీ సర్వే వల్ల రైతుల భూ సమస్యలు పరిష్కారమయ్యాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్ జగనన్న భూహక్కు, భూ రక్ష పథకం పేరును చంద్రన్న ఏపీ రీ సర్వే ప్రాజెక్టుగా మార్చింది. అంతటితో ఆగకుండా 1–బీ మంజూరు చేయకుండా ఆన్‌లైన్ సేవలను నిలిపివేయించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా రీ సర్వే పూర్తయిన మండలాల్లో 1–బీ పత్రాలు పొందలేక రైతులు, ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. మేలు చేయాల్సిన కూటమి ప్రభుత్వం కుట్రలకు పాల్పడి ఇబ్బందులకు గురిచేయడం సబబు కాదని రైతులు, ప్రజలు మండిపడుతున్నారు.



మీ భూమి వెబ్‌సైట్‌లో 1–బీ మంజూరు చేసే ఆన్‌లైన్ వెబ్‌సైట్



పలమనేరు తహసీల్దార్ కార్యాలయం

హోల్డ్‌లో రీసర్వే జరిగిన గ్రామాల రికార్డులు


జిల్లాలోని సగానికిపైగా గ్రామాల్లో గత ప్రభుత్వం రీసర్వే చేపట్టి డిజిటల్ రికార్డులను తయారు చేసింది. ఈ భూములకు ఐడీ, క్యూఆర్ కోడ్‌లను రూపొందించింది. సబ్ డివిజన్ కాని సర్వే నంబర్లకు సబ్ డివిజన్ చేసి భూహక్కు పత్రాలు పంపిణీ చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల భూములను కొట్టేయాలని చూస్తోందని 2024 ఎన్నికల్లో టీడీపీ ఆరోపించి ప్రజల్లో లేనిపోని అనుమానాలను కలిగించింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ అదే కార్యక్రమాన్ని చంద్రన్న ఏపీ రీసర్వే ప్రాజెక్టు పేరిట చేపట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ కార్యక్రమం ఎప్పుడు మొదలవుతుందో తెలియని పరిస్థితి. అంతవరకు రైతులకు అవసరమైన రికార్డులను ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారు.

బ్యాంకు రుణాలు, రెన్యువల్‌కు తప్పని తిప్పలు

జిల్లాలోని పలు బ్యాంకుల్లో 1.20 లక్షల మందికి పైగా రైతులు పంట రుణాలు పొందారు. వీరిలో 30 వేల మంది వరకు రుణాలను రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. ఇందుకుగాను వారికి 1–బీ తప్పనిసరి అయింది. సకాలంలో బ్యాంకు రుణాలను రీషెడ్యూల్ చేయకుంటే బ్యాంకర్లు ఒప్పుకోవడం లేదు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 1–బీ లేనిది తనఖా రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో సగానికి పైగా గ్రామాలకు 1–బీ ఇవ్వడం లేదు. దీంతో రైతులు నిత్యం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతూ ఉన్నారు. దీనిపై ఉన్నతాధికారులైనా స్పందించి 1–బీలు ఇచ్చేలా చూడాల్సి ఉంది. ఈ సమస్యపై సంబంధిత రెవెన్యూ అధికారులను రైతులు అడగ్గా రాష్ట్ర స్థాయిలోనే ఈ సమస్య ఉందని, విజయవాడలోనే సర్వర్‌ను ఆపేశారని చెబుతున్నారు. దానిపై తాము ఏమీ చేయలేమనే సమాధానం ఇస్తున్నారు.

329 గ్రామాల్లో 1-బీ సేవలు నిలిపివేత

జిల్లా వ్యాప్తంగా చిత్తూరు, నగరి, కుప్పం, పలమనేరు రెవెన్యూ డివిజన్లలో గత ప్రభుత్వం రీ సర్వే నిర్వహించింది. అధికారులు నాలుగు విడతల్లో గుర్తించిన గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను పూర్తి చేశారు. మొదటి దశలో 132 గ్రామాల్లో 81,414.83 ఎకరాలు, రెండవ విడతలో 91 గ్రామాల్లో 1,17,117.51 ఎకరాలు, మూడవ విడతలో 87 గ్రామాల్లో 85,137.69 ఎకరాలు, నాలుగో విడతలో 19 గ్రామాల్లో 18,885.23 ఎకరాల్లో రీ సర్వేను చేశారు. ఇలా జిల్లా మొత్తం నాలుగు విడతల్లో 329 గ్రామాల్లో 3,02,555.26 ఎకరాల్లో రీ సర్వే చేసి ప్రజలు, రైతులకు శాశ్వత భూ హక్కు పట్టాలు అందజేశారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 329 గ్రామాల్లో 1–బీ సేవలను నిలిపివేసి రైతులు, ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తోంది.



త్వరలో పరిష్కారం



రీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని రైతులకు 1–బీ సర్టిఫికెట్ల మంజూరులో టెక్నికల్ సమస్య నెలకొంది. దాన్ని పరిష్కరించేందుకు రాష్ట్ర ఉన్నత అధికారులు ప్రయత్నిస్తున్నారు. త్వరలో పరిష్కారమవుతుందని భావిస్తున్నాం. టెక్నికల్ సమస్య ఉన్న రైతులు సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

– చిన్నయ్య, ఆర్డీఓ, చిత్తూరు

'ఇది మంచి ప్రభుత్వం'కు స్పందన కరువు

బైరెడ్డిపల్లి: మండలంలోని బైరెడ్డిపల్లె–1, బైరెడ్డిపల్లె–2, ఆల్లపల్లె సచివాలయాల్లో నిర్వహిస్తున్న 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. సభలకు ప్రజలు పెద్దగా రాకపోవడంతో అధికారులు, సచివాలయ సిబ్బందితోనే మమా అనిపించారు. బైరెడ్డిపల్లె సచివాలయం–1 వద్ద శనివారం మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. ఒంటి గంటకు కూడా ప్రజలు రాకపోవడంతో ఉన్న వారితోనే సభను ముగించేశారు. బైరెడ్డిపల్లె సచివాలయం–2 వద్ద 2 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పినా ఎవరూ రాకపోవడంతో అధికారులు వెనుదిరిగారు. ఆల్లపల్లెకు రోడ్డు ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు అధికారులను కోరారు. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, తహసీల్దార్ మాధవరావు, ఏవో గీతాకుమారి తదితరులు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లె సచివాలయం వద్ద ఖాళీగా ఉన్న కుర్చీలు

సమస్యల వెల్లువ

మంచి ప్రభుత్వమైతే ఇన్ని సమస్యలెందుకు?

పలమనేరు: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం పలమనేరు పట్టణం గొబ్బిళ్లకోటూరులో నిర్వహించారు. ఇందులో స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీడీపీ నాయకులు ప్రభుత్వాన్ని పొగుడుతూ వంద రోజుల్లోనే ప్రజల కష్టాలు తీరాయని గానాభజానా చేశారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే ప్రజలు భారీ సంఖ్యలో పైకి లేచి అర్జీలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీన్ని గమనించిన అక్కడున్న నేతలు ఇదేంది సామీ వంద రోజులకు ప్రజల నుంచి ఇన్ని సమస్యలొస్తే వచ్చే నాలుగేళ్లలో పరిస్థితి ఏమిటని అనడం వినిపించింది.



పలమనేరు మంచి ప్రభుత్వంలో అమరనాథ్‌కు అర్జీలు అందజేస్తున్న ప్రజలు

సామాజిక తనిఖీలో రూ.96,987 రికవరీ



సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు

కార్వేటినగరం: మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీలో రూ.96,987 రికవరీ చేసినట్టు డ్వామా పీడీ రాజశేఖర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పీడీ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఉపాధిహామీ పనుల్లో జరిగే అవినీతిని వెలికితీసేందుకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండలంలో ఉపాధిహామీ కింద సుమారు రూ.9 కోట్లతో మొక్కల పెంపకం, ఇంకుడు గుంతల తవ్వకం, పండ్ల తోటల పెంపకంతోపాటు మెటీరియల్ పనులకు వెచ్చించినట్టు తెలిపారు. సామాజిక తనిఖీల్లో అవినీతి జరిగినట్టు గుర్తించి సంబంధిత సిబ్బంది నుంచి రూ.96,987 రికవరీ చేసినట్టు తెలిపారు. ఏపీడీ శోభన్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ 100 రోజుల పనులు కల్పించి గిట్టుబాటు కూలి అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారిణి గంగాభవాని, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీపతి, ఎంపీడీవో జాహ్నవి, ఎస్ఆర్‌పీ రవి, డీఆర్పీలు, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అండర్–14 జూడో పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్–14 జూడో పోటీలు ఆదివారం ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు ఎస్.బాబు, జె.వసంతవాణి, ఎం.వసంత ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ పోటీలకు అన్ని జిల్లాల నుంచి సుమారు 300 మందికి పైగా బాలబాలికలు హాజరవుతారని వారు తెలిపారు.

నేత్రపర్వంగా పుష్ప పల్లకి సేవ

- పోటెత్తిన భక్తులు
- అంగరంగ వైభవంగా ప్రత్యేక బ్రహ్మోత్సవాలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో పత్యేక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం పుష్పపల్లకి సేవను నేత్రపర్వంగా చేపట్టారు. ఈ సేవను తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. వేకువజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి పరిమళభరిత పుష్పమాలికలతో పుష్పపల్లకిని ముస్తాబు చేశారు. ఉభయదారులు సంప్రదాయబద్ధంగా స్వామికి పూజ సామగ్రి, పట్టువస్త్రాలను సమర్పించారు. తర్వాత ఉత్సవమూర్తిని పుష్పపల్లకిలో అధిష్టింపజేశారు. గణనాథుడు పుష్ప పల్లకిలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు.



పుష్పపల్లకిలో ఊరేగుతున్న వినాయకుడు (ఇన్‌సెట్) విశేషాలంకరణలో స్వామివారు

నేడు కామధేను వాహనం

ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కామధేను వాహన సేవ ఉంటుందని ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఉదయం అభిషేకం ఉంటుందని, అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. రాత్రికి స్వామి వారు కామధేనువుపై విహరిస్తారని తెలిపారు.

లడ్డు పోటు తనిఖీ



లడ్డు పోటులోని స్టోర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఈవో

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని లడ్డు పోటును శనివారం ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్ తనిఖీ చేశారు. నెయ్యి నిల్వ, లడ్డు తయారీ విధానంపై ఆరా తీశారు. నెయ్యిని క్వాలిటీ టెస్టింగ్ కోసం నేషనల్ డైరీ డెవలప్‌మెంట్‌కు పంపేలా చర్యలు తీసుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శనివారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రధాన ఆలయ అలంకార మండపంలో సిద్ధి బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులను తీసుకెళ్లి ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని చేపట్టారు.

స్వర్ణ రథంపై ఊరేగిన స్వామివారు

వరసిద్ధి వినాయకస్వామి శనివారం రాత్రి స్వర్ణ రథంపై కొలువై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అలంకార మండపంలో ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చక, వేద పండితులు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి స్వర్ణ రథంలో కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులతో స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో గురుప్రసాద్ పాల్గొన్నారు.



వ్రతంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

పంటలపై ఏనుగుల దాడి



సదుం: ధ్వంసమైన చెరకు పంట

సదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ మారుతివారిపల్లె సమీపంలోని పొలాలపై శుక్రవారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు దాడి చేసి పంటలను ధ్వంసం చేశాయి. జనార్ధన్ రెడ్డి, చంద్రమ్మ, కృష్ణమ్మ, రెడ్డెప్ప రెడ్డికి చెందిన వరి, చెరకు పంటలు, రాతి కూసాల కంచె ధ్వంసమయ్యాయి. అదేవిధంగా నల్లరాళ్ల ఉప్పరపల్లెలో రాఘవకు చెందిన కాలీఫ్లవర్ పంటను నాశనం చేశాయి. తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నేత ఇంటి ప్రహరీగోడ కూల్చివేత



టీడీపీ నేతలు కూల్చివేసిన ప్రహరీగోడ

బైరెడ్డిపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ ఆగడాలకు అంతులేకుండాపోతోంది. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు దిగుతూనే ఉన్నారు. ఈ క్రమంలోనే మండలంలోని దేవదొడ్డిలో నివాసముంటున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కార్తీక్ ప్రహరీ గోడను శనివారం టీడీపీ నేతలు కూల్చివేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ ఇంటి చుట్టూ నిర్మించుకున్న ప్రహరీ గోడను దేవదొడ్డి సర్పంచ్ భర్త తన అనుచరులతో వచ్చి కూల్చివేశాడని పేర్కొన్నారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం కలిగినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు.

3న ఖాళీ టిన్‌ల విక్రయానికి సీల్డ్ టెండర్ల ఆహ్వానం

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ టిన్లు రేటు కాంట్రాక్టు కింద సీల్డ్ టెండర్లను టీటీడీ ఆహ్వానిస్తోంది. టీటీడీ వినియోగించిన ఖాళీటిన్లు 2025 మార్చి వరకు సేకరించవచ్చు. తిరుపతిలోని హరేకృష్ణ రోడ్డులోని మార్కెటింగ్(వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు అక్టోబరు 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయాలి. ఇతర వివరాలకు మార్కెటింగ్(వేలం) కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో సంప్రదించాలని టీటీడీ అధికారులు కోరారు.

బడా స్మగ్లర్లు దొరికేదెన్నడో..?

చిత్తూరు జిల్లాలోకి కర్ణాటక మద్యం పెద్ద ఎత్తున తరలివస్తోంది. పోలీసులు, సెబ్, ఎక్సైజ్ అండ్ విజిలెన్స్ అధికారులు పటిష్ట నిఘా పెట్టినా అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నిందితులను అరెస్టు చేయడం, సరుకుతోపాటు వాహనాలను స్వాధీనం చేసుకుంటూనే ఉన్నారు. కర్ణాటక మద్యం అక్రమ రవాణాలో కీలకంగా ఉన్న బడా స్మగ్లర్లను పట్టుకోవడంలో జిల్లాకు చెందిన అన్ని శాఖల అధికారులు విఫలమవుతూనే ఉన్నారు.

- యథేచ్ఛగా కర్ణాటక మద్యం సరుకు
- సరుకు తరలింపులో కీలకంగా బడా స్మగ్లర్లు
- ఆన్‌లైన్‌లోనే నగదు చెల్లింపులు
- పలమనేరు హైవేమీదుగా చిత్తూరు సరుకు
- కీలక వ్యక్తులపై ఇప్పటికే నిఘా

పలమనేరు: చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్ణాటకకు సరిహద్దు ప్రాంతంగా ఉంది. ఇక్కడ మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో కొంతమంది కర్ణాటక నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. పోలీసులతోపాటు సెబ్, ఎక్సైజ్ అండ్ విజిలెన్స్ అధికారులు నిరంతరం దాడులు చేస్తూ సరుకును పట్టుకుంటున్నారు. ఈ అక్రమ రవాణాలో కీలకంగా మారిన బడా స్మగ్లర్ల కోసం కొన్నేళ్లుగా వేటాడుతున్నప్పటికీ దొరకడం లేదు. కర్ణాటకలోని పలు ప్రాంతాల నుంచి పలమనేరు జాతీయ రహదారి మీదుగానే మద్యం అక్రమ రవాణా అవుతోంది. ఈ సరుకు ఎక్కువగా జిల్లా కేంద్రమైన చిత్తూరు ప్రాంతానికే చేరుతున్నట్టు ఇటీవల పోలీసులు భారీగా పట్టుకున్న మద్యం కేసుల్లోని నిందితుల ద్వారా బయటపడింది. దీనిపై నిఘా ఉంచిన పోలీసులు కర్ణాటకలోని మద్యం షాపుల నుంచి వాహనాలకు సరిపడా పెద్ద మొత్తంలో సరుకు ఇస్తున్న వ్యక్తులు ఎవరనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌ను పట్టుకుంటే జిల్లాలోకి కర్ణాటక మద్యం రాకుండా అడ్డుకట్ట వేసే అవకాశం ఉంది.



గంగవరం పోలీసులు పట్టుకున్న కర్ణాటక మద్యం(ఫైల్)

కర్ణాటకలో భారీగా సరుకు ఇచ్చేదెవరు?

జిల్లాలోకి వస్తున్న కర్ణాటక మద్యం ఇంత పెద్ద మొత్తంలో ఎవరు ఇస్తున్నారనే విషయాన్ని కనుక్కోవడంలో సెబ్ అధికారులు విఫలమైనట్టు తెలుస్తోంది. సాధారణంగా కర్ణాటకలోని ముళబాగిలు తాలుకాలో పది వరకు మద్యం దుకాణాలు మన సరిహద్దుకు సమీపాల్లోనే ఉన్నాయి. వారు రోజువారి స్టాకు, విక్రయాల వివరాలను అక్కడి అధికారులకు తెలిపాల్సి ఉంటుంది. రోజుకు పది వేల టెట్రా ప్యాకెట్లను విక్రయించే అవకాశం షాపుల్లో అసాధ్యమే. నగదును రకరకాల నంబర్లకు ఫోన్‌పేలో పంపిస్తే కోలారు జిల్లాకు చెందిన కొందరు బడా స్మగర్లు ఎంత సరుకు కావాలన్నా సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. నిందితులు పంపిన ఫోన్‌పే నంబరు ఆధారంగా కర్ణాటకకు చెందిన కీలక నిందితుడిని గతంలోనే పట్టుకునేందుకు గంగవరం పోలీసులు విశ్వప్రయత్నం చేసినా ఫలితం లేదు. సరుకును పంపించే కీలక నిందితుడిని పట్టుకుంటే గాని జిల్లాలోకి వస్తున్న అక్రమ మద్యానికి అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదు. త్వరలో ఏపీలో మద్యం ధరలు తగ్గనున్నాయి. అంతేగాక అధికారులు బదిలీల ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడే కర్ణాటక మద్యాన్ని ఎక్కువగా అక్రమ రవాణా చేయాలనే ప్లాన్‌తో స్మగర్లు ఉన్నట్టు సమాచారం. దీనిపై సెబ్, పోలీసులు నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది

ఒకే రకంగా స్మగ్లింగ్

గతంలో కొరియర్ వాహనంలో చిత్తూరుకు తరలిస్తున్న రూ.10 లక్షల విలువజేసే కర్ణాటక టెట్రా ప్యాకెట్లను గంగవరం పోలీసులు సీజ్ చేశారు. ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. చెన్నై-బెంగళూరు హైవేలో నంగిళి నుంచి పలమనేరు బైపాస్ దాకా సరుకును చాలా తెలివిగా వీరు తీసుకొస్తున్నట్టు విచారణలో తేలింది. ముందుగా నంబరు ప్లేట్‌లేని ద్విచక్ర వాహనం, దానికి కిలోమీటరు దూరంలో ఎస్కార్టుగా ఓ కారు వస్తుంది. ఇందులోని వారు ఫోన్‌లో ఇచ్చే సూచనలతో సరుకుతో వచ్చే వాహనం సురక్షితంగా సరిహద్దు దాటుతుంది. ఆ తర్వాత వారు అనుకున్న ప్రాంతానికి తరలిస్తారు. అక్కడి నుంచి విక్రయదారులకు చేరుస్తారు. ఈ తరహాలో మద్యం తరలింపులో ఎస్కార్టుగా ఉన్న రెండు వాహనాలు, రూ.5 లక్షల విలువజేసే కర్ణాటక మద్యాన్ని చిత్తూరు పోలీసులు సీజ్ చేశారు. పోలీసులకు పట్టుబడిన కర్ణాటక సరుకు సైతం ఒకటే బ్రాండ్ కావడం గమనార్హం.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితునితో పోలీసులు

పెద్దపంజాణి: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం ప్యాకెట్లు తీసుకువస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సహదేవి తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు ముత్తుకూరు క్రాస్ వద్ద నిఘా పెట్టామన్నారు. బైక్‌లో వస్తున్న కొళత్తూరు పంచాయతీ గల్లావారిపల్లికి చెందిన శ్రీరాములు కుమారుడు జగపతి వద్ద 96 టెట్రా ప్యాకెట్లు ఉన్నాయన్నారు. బైక్‌ను, మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

రాజారెడ్డికి మాజీ మంత్రి నివాళి

చౌడేపల్లె: వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కల రాజారెడ్డి(75) మృతి పార్టీకి తీరనిలోటని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన శనివారం కాటిపేరి పంచాయతీ గిరిజాపురంలో రాజారెడ్డి దశ దినకర్మ క్రియల్లో పాల్గొన్నారు. రాజారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ శ్రేణులు ఎవరూ అధైర్యపడొద్దని, ఏకష్టం వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతకుముందు ఆయనకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నేతలు ఘన స్వాగతం పలికారు. పార్టీ నేతలతో పెద్దిరెడ్డి మమేకమయ్యారు. పలువురు తమ సమస్యలను పెద్దిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు షరీఫ్, వైస్ ఎంపీపీలు, నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు సరితారెడ్డి, కృష్ణారెడ్డి, షంషీర్, అంజిబాబు, నేతలు సుధాకర్‌రెడ్డి, రాజారెడ్డి, పద్మనాభరెడ్డి, శ్రీనివాసులు, లద్దూరమణ, రాజప్ప, కళ్యాణ్, పవన్, హరీష్, సాధిక్, రమేష్‌బాబు, శంకర్‌రెడ్డి, షఫీ పాల్గొన్నారు.



రాజారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నైపుణ్యాలతో సులభంగా ఉద్యోగాలు

చిత్తూరు కలెక్టరేట్ : నైపుణ్యాలుంటే సులభంగా ఉద్యోగాలు సాధించవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. చిత్తూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఐదు రోజులుగా ఇస్తున్న శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మెళకువలు, వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలు ముఖ్యమన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్ మాట్లాడుతూ మహిళలు వ్యాపారంలో రాణించడానికి అవసరమైన ముద్ర, ఫుడ్ ప్రాసెసింగ్ రుణాలను అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ తరపున సంజీవరావ్, ఉపాధికల్పన శాఖ తరపున గోపీకృష్ణ, ఏకాంబరం, అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ లో పాల్గొన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

విద్యుత్ సమస్యపై గ్రామస్తుల ఆందోళన

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరు, వైర్లు మార్చాలని డిమాండ్
- జాతీయ రహదారిపై స్తంభించిన రాకపోకలు

బంగారుపాళెం: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము కరెంట్ షాక్‌కు గురవుతున్నామని మండలంలోని గుండ్లకట్టమంచి దళితవాడ వాసులు ఆరోపించారు. వారు శనివారం రాత్రి చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు, వైర్ల వల్ల ఇళ్లలోని వస్తువులకు కరెంట్ సరఫరా అయి షాక్ కొడుతోందని వాపోయారు. ఈ విషయం ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే రెండు రోజుల క్రితం ఇంట్లో కరెంటు షాక్‌కు గురై తాతా మనవడు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ముందుగానే స్పందించి ఉంటే రెండు ప్రాణాలు పోయేవి కాదని వాపోయారు. అధికారులు తమ సమస్యను పరిష్కరించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని భీష్మించారు. ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ వైర్లు మార్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. జాతీయ రహదారిపై దళితవాడ గ్రామస్తులు ఆందోళన చేపట్టడంతో సుమారు గంట సేపు వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులతో చర్చించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

చనిపోయినా వైద్యం

- కన్నుమూసిన చిన్నారిని వేరే ఆస్పత్రికి రెఫర్
- ఠాగూర్ సినిమాను తలపించిన డాక్టర్
- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- కేసు నమోదు చేస్తామన్న సీఐ

పుంగనూరు: పసికందు చనిపోయి గంటలు గడిచినా చికిత్స అందించినట్లు ప్రవర్తించి, చివరకు బిడ్డను త్వరగా మదనపల్లె ఆస్పత్రికి తీసుకెళ్లండి లేకుంటే ప్రమాదమని నమ్మబలికాడు. ఠాగూర్ సినిమాను తలపించేలా జరిగిన ఈ సంఘటన శనివారం రాత్రి పుంగనూరులో చోటుచేసుకుంది. పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని నక్కబండలో దళిత కులానికి చెందిన బాలు, వినీల దంపతులకు కుమారుడు సాత్వీక్‌నంద (10 నెలలు) దగ్గు, జలుబు, జ్వరంతో బాధపడుతున్నాడు. గత వారం పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న కార్తీక్ చిన్నపిల్లల ఆస్పత్రిలో చేర్చారు. ప్రతి రోజూ చికిత్స పేరుతో రూ.వేలు గుంజుకున్న డాక్టర్ కార్తీక్‌రాజ్ శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో నర్సుతో ఏదో మాట్లాడి వెళ్లిపోయాడు. తర్వాత కొద్ది సేపటికి బిడ్డకు ఊపిరి ఆడడం లేదని, తక్షణమే మదనపల్లె ఆస్పత్రికి తీసుకెళ్లాలని డాక్టర్ చెప్పి బయటకు వెళ్లాడని నర్సు చెప్పింది. దీంతో పసిబిడ్డ తల్లి ఆందోళన చెంది తక్షణమే భర్తకు ఫోన్ చేసి పిలిపించింది. వెంటనే పట్టణంలోని మరో ఆస్పత్రికి హుటాహుటిన తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన డాక్టర్ బిడ్డ చనిపోయినట్టు తెలిపి చికిత్స చేసిన డాక్టర్ వద్దకే వెళ్లాలని సూచించారు. దీంతో బాధిత కుటుంబం ఆందోళనకు దిగింది. పోలీస్‌స్టేషన్ ఎదురుగానే ఆస్పత్రి ఉండడంతో డాక్టర్ అక్కడికి చేరుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే సీఐ శ్రీనివాసులు స్టేషన్‌కు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. డాక్టర్ అందించిన మందులు, ప్రిస్క్రిప్షన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు తహసీల్దార్‌కు సమాచారం అందించారు. నిర్లక్ష్యంగా వైద్యం చేసి పసికందు మృతికి కారణమైన డాక్టర్ కార్తీక్‌రాజ్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. పసిబిడ్డ తల్లి, మరో బిడ్డ కూడా జ్వరంతో బాధపడుతుండడం పలువురిని కలచివేసింది. నక్కబండలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో పలువురు జ్వరాల బారిన పడుతున్నట్లు సాక్షిలో కథనాలు ప్రచురితమయ్యాయి. అయినా మున్సిపాలిటీ, వైద్య అధికారుల్లో చలనం లేకపోవడంతో పసికందు మృత్యువాత పడ్డాడు.



పుంగనూరులో డాక్టర్ నిర్లక్ష్యంతో మృత్యువాత పడ్డ సాత్వీక్ నంద



పసిబిడ్డ శవంతో బాధితుల ధర్నా

నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్‌ను అరెస్టు చేయాలని బాధితులు పసిబిడ్డ శవంతో ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. - 8లో



సత్తా చాటి.. పతకాలు పట్టి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లోనూ రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. - 8లో



ఉపాధిలో అతనే డాన్

గుడిపాల మండలంలో ఉపాధి హామీ జూనియర్ ఇంజినీర్ అన్నీ తానై చెలరేగిపోతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

2 టన్నుల కూరగాయలు వితరణ



కూరగాయలు అందజేస్తున్న శ్రీకాంత్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి ఆదివారం కర్ణాటక రాష్ట్రం హోసూర్‌కు చెందిన శ్రీకాంత్ సుమారు 2 టన్నుల కూరగాయలను వితరణ చేశారు. వాటిని ఆలయ అధికారులకు అందించారు. కార్యక్రమంలో అన్నదాన సూపరింటెండెంట్ బాలరంగస్వామి, మునిరామయ్య పాల్గొన్నారు.

27న పుత్తూరులో ఉద్యోగ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 27వ తేదీన తిరుపతి జిల్లా పుత్తూరులో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధికల్పనా కార్యాలయం, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. పదవ తరగతి నుంచి డిగ్రీ, ఆపైన చదువులు చదివి, 18 నుంచి 35 ఏళ్లలోపు వారు ఇంటర్వ్యూల్లో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 6300954441, 7993502145 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వాణిజ్య పన్నుల శాఖలో అధికారుల బదిలీలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా వాణిజ్య పన్నుల శాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ కమిషనర్ భానుప్రకాష్‌ను విజయవాడ రీజనల్ కార్యాలయానికి బదిలీ చేయగా ఆయన స్థానంలో విజయవాడ హెడ్ ఆఫీసు నుంచి విజయభాస్కర్ రానున్నారు. పలమనేరు సహాయ కమిషనర్ రవికుమార్‌రెడ్డిని ప్రొద్దుటూరు-2కు మార్చారు. ఆయన స్థానంలో మదనపల్లె నుంచి శ్రీనివాసరావును నియమించారు. అదేవిధంగా ఆరుగురు డీసీటీఓలు, 12 మంది ఏసీటీఓలు, 12 మంది ఏఈఓలు, 16 మంది ఈటీఏలు బదిలీ అయ్యారు.



యథేచ్ఛగా పచ్చ లాటరీలు!

- స్మార్ట్ ఫోన్లు, యాప్‌లతో ఆన్‌లైన్‌లో లావాదేవీలు
- మరికొన్ని చోట్ల నంబర్ల ఆట, కాటన్ లక్కీ మాయ
- తమిళనాడు ముఠా ఆదేశాలతో పనిచేస్తున్న ఇక్కడి ఏజెంట్లు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- అధికారం అండతో రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు

పలమనేరు:చిత్తూరు జిల్లాలోని పలమనేరు, కుప్పం, చిత్తూరు, నగరి, పుత్తూరు నియోజకవర్గాలు తమిళనాడు రాష్ట్రానికి ఆనుకుని ఉన్నాయి. తమిళనాడులో లాటరీ వ్యాపారంలో ఆరితేరిన ముఠాలు ఆంధ్రాలోని ప్రాంతాల్లో ఏజెంట్లుగా స్థానికులను నియమించుకుని కేరళ ఆన్‌లైన్ లాటరీ పేరిట దందాను నిరాటకంగా కొనసాగిస్తున్నారు. పలమనేరు పట్టణంలోనే లాటరీ ఏజెంట్లు 20 మంది వరకు ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరికి పట్టణానికి చెందిన ఓ టీడీపీ యువనేత అండ ఉండడంతో ఇబ్బంది లేకుండా వ్యవహారం సాగిపోతోంది. ఇక జిల్లాలోని సరిహద్దు పట్టణాల్లో వందలాది మంది ఏజెంట్లు నిత్యం ఇదే పనిలో ఉన్నట్టు సమాచారం. ఆయా ప్రాంతాలకు చెందిన కూటమి నేతలు అండగా ఉంటూ వారి నుంచి మామూళ్లు తీసుకుంటూ పోలీసులను సైతం తమ గుప్పెట్లో పెట్టుకున్నట్టు తెలుస్తోంది.

కాటన్, రాజా లాటరీలు

ముందుగానే కొన్ని లక్కీ నంబర్లను ఎంపిక చేసుకొని ఆపై వేలల్లో నంబర్లను విక్రయిస్తారు. ఇందులో రూ.10లకు రూ.500, రూ.50లు కడితే రూ.5 వేలు, రూ.100లకు రూ.10 వేలు, రూ.1000లకు రూ.లక్ష ఇస్తామని చెప్పి నంబర్లను విక్రయిస్తారు. ఏ పూటకాపూట ఒకరిద్దరికి లాటరీ కొట్టిందని డబ్బులిచ్చి చాలా మందిని ఈ ఊబిలోకి లాగుతున్నారు. దురాశకు వెళ్లి ఇందులో నంబర్లు కొన్న వారికి చివరికి ఏమీ రాక తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలా లక్షల్లో నగదు వసూలు చేసి వేలల్లో ప్రైజ్‌లను తక్కువ మొత్తంలో ఎక్కువ మందికి ఇస్తూ తెలివిగా మోసం చేస్తున్నారు. వీటిని ఎక్కువగా దినసరి కూలీలు, లారీ, ఆటో డ్రైవర్లు, మండీల్లో పనిచేసే వారు, కార్మికులు కొనుగోలు చేస్తున్నారు.

అధికారం అండతో తెలుగు తమ్ముళ్లు చెలరేగిపోతున్నారు. మమ్మల్ని ఆపేదెవరంటూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో నిషేధం ఉన్న లాటరీలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇన్నాళ్లు గుట్టుగా సాగిన వ్యవహారం ఇప్పుడు బహిరంగంగా సాగుతోంది. కొందరు ఏజెంట్లను నియమించుకుని కేరళ ఆన్‌లైన్ యాప్‌లను పాలో అవుతూ అందులోని కోడ్ నంబర్ల ఆధారంగా పేదల నుంచి డబ్బు గుంజుతున్నారు. ఈ వ్యవహారాలన్నీ సెల్‌ఫోన్ ద్వారా లేదా నిర్దేశించిన ప్రాంతాల్లో రహస్యంగా సాగుతుండడంతో పోలీసులు ఏమీ చేయలేకపోతున్నారు. ఈ ఊబిలో చిక్కుకుని అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

రోజుకు లక్షల్లో వ్యాపారం

ఈ లాటరీ వ్యాపారం ఎక్కువగా జరిగే పట్టణాల్లోని కిరాణా దుకాణాలు, టీ కొట్లు, పాన్‌షాపులు, ఆటో స్టాండ్లు, కూలీలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని క్రాస్‌లలో ఏజెంట్లు అమ్మకాలు చేస్తుంటారు. ఆన్‌లైన్‌లో లాటరీకి ఎక్కువగా మధ్య తరగతికి చెందిన వారే కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోనే 200 మంది దాకా ఏజెంట్లు లాటరీని నిర్వహిస్తున్నట్టు సమాచారం. రోజుకి రూ.80 లక్షల వరకు లాటరీ వ్యాపారం సాగుతోందంటే ఈ దందా ఎంతలా నడుస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఏదేమైనా గట్టుచప్పుడు కాకుండా పేదలను అప్పుల పాలు చేస్తున్న ఈ లాటరీ ముఠాలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. పోలీసు అధికారులు ఇటీవల బదిలీపై జిల్లాకు రావడంతో దీనిపై వారికి అవగాహన ఉండడం లేదు.

రకరకాలుగా లాటరీలు

కేరళ రాష్ట్రంలో లాటరీలపై నిషేధం లేదు. అక్కడ వందల సంఖ్యలో ఆన్‌లైన్ లాటరీలు స్మార్ట్‌ఫోన్ సాయంతో నడుస్తున్నాయి. ఇదే తరహాలో తమిళనాడులోని గుడియాత్తం, వేలూరు, ధర్మపురి, క్రిష్ణగిరి, తిరప్పత్తూర్, షోలింగర్, తిరుత్తణికి చెందిన ముఠాలు మన జిల్లాలో లాటరీలను నిర్వహిస్తున్నారు. ఈ వ్యాపారం రహస్య కోడ్ల ఆధారంగా సాగుతోంది. కారుణ్య ప్లస్ అయితే(కేఎన్-447), నిర్మల్ (ఎన్ఆర్-304), విన్‌వన్(డబ్ల్యూ-695), శ్రీశక్తి (ఎస్ఎస్-341) లాంటి పేర్లతో వీక్లీ, డైలీ, ప్రతి మూడు గంటలకోసారి, గంటసేపే లాంటి లాటరీలున్నాయి. వీటి ధర రూ.40 నుంచి రూ.500 వరకు ఉంటుంది. ఎవరైనా లాటరీ నంబరు కావాలంటే స్థానిక ఏజెంట్‌కు డబ్బులివ్వగానే ఓ కోడ్ చెబుతాడు. తీసుకున్న కోడ్‌కు ఎప్పుడు రిజల్ట్ వస్తుందో అప్పుడు ఏజెంట్ దాన్ని ప్రకటిస్తాడు. ఇదంతా ఆన్‌లైన్ యాప్ ద్వారా జరుగుతుంది. ఫలితం వచ్చిన పది నిమిషాల్లో ఎవరికి లాటరీ తగిలిందో తెలిసిపోతుంది. సింగిల్ డిజిట్ లాటరీలను సైతం జిరాక్స్ చేసి వాటిపై నంబర్లు వేసి రహస్యంగా విక్రయిస్తున్నారు.



రకరకాల పేర్లు, కోడ్‌లతో సాగే లాటరీలు



యాప్‌లో రోజు వారీ ఫలితాలు ఇలా

26న పీఎంఈజీపీపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం (పీఎంఈజీపీ)పై ఈ నెల 26న కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు పీఎంఈజీపీ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు హాజరుకావొచ్చని సూచించారు. ఈ పథకం కింద వస్తువుల తయారీ పరిశ్రమలు నెలకొల్పేందుకు రూ.50 లక్షల వరకు రుణం అందజేస్తారని తెలిపారు. వివరాలకు ఏపీ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి 9440814613, 9849612989లో సంప్రదించాలని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరులోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఇందులో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. అధికారులు కార్యక్రమానికి గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. ప్రజలు నేరుగా తనను కలిసి తమ సమస్యల గురించి మాట్లాడవచ్చని పేర్కొన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని తెలిపారు.

కామధేనువుపై విఘ్నేశ్వరుడి విహారం



వాహన సేవలో అధికారులు, ఉభయదారులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు కామధేనువుపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తెల్లవారుజామునే స్వామిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి స్వామి వారు కామధేనువు వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ముందుగా అలంకార మండపంలో శ్రీసిద్ధి బుద్ధి సమేత వినాయస్వామి ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి కామధేనువు వాహనంలో అధిష్ఠింపజేశారు. మంగళవాయిద్యాలు, మేళాతాళాలు, కోలాటాలు, భజన బృందాల ప్రదర్శనల నడుమ ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈవో గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు సూర్యప్రభ వాహనం

కాణిపాకం ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వినాయక స్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతారని ఆలయ ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఉదయం అభిషేకం, రాత్రి సూర్యప్రభ వాహనం ఉంటాయని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

భక్తులతో పోటెత్తిన బోయకొండ



ఆలయంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లి:మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, జంతు సంపద వృద్ధి చెందాలని ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, దివ్వెలతో మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఇసుకను దోచేస్తున్న అక్రమార్కులు

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అక్రమార్కులు కూటమి నేతల అండతో రాత్రీపగలు తేడా లేకుండా ఇసుకను తరలిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో ఇసుక అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. ముఖ్యంగా గంగాధరనెల్లూరులోని నీవానది నుంచి పెద్ద ఎత్తున ఇసుకను తవ్వుతుండడంతో వంతెన కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

- రాత్రీపగలు తేడా లేకుండా రవాణా
- రూ.కోట్లు ఆర్జిస్తున్న వైనం
- పట్టించుకోని ప్రభుత్వాధికారులు
- నీవా నది వంతెనకు పొంచి ఉన్న ప్రమాదం

సాక్షి టాస్క్ ఫోర్స్: మండల కేంద్రమైన గంగాధర నెల్లూరు సమీపంలో నీవానది ప్రవహిస్తోంది. ఇందులో నాణ్యమైన ఇసుక ఉంది. దీనిపై కూటమి నేతల కన్ను పడింది. దీంతో కొద్దిరోజులుగా యంత్రాలతో వంతెన కింద, సమీపంలో, వంతెన చుట్టుపక్కల ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.2000 వేలకు విక్రయిస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. నీవానది వంతెన పైనుంచి మండల, జిల్లా అధికారులు నిరంతరం వెళుతుంటారు. ఇసుక అక్రమ రవాణా కనిపిస్తున్నా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన కొందరు నేతలు అధికారులను తమ చేతిలో ఉంచుకుని, లేకుంటే బెదిరిస్తూ దర్జాగా ఇసుకను దోచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన బ్యానర్‌ను చింపేసిన ఇసుకాసురులు

నీవా నది వంతెనకు పొంచి వున్న ప్రమాదం

పెద్ద ఎత్తున ఇసుకను తవ్వేడంతో నీవానదిపై ఉన్న వంతెన ప్రమాదంలో ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గత సంవత్సరం అధిక వర్షాలతో ఏరు సాగడంతో నీవానదికి రెండు మూలల కోతకు గురైంది. అంతే గాక వంతెన ఒకవైపు పాక్షికంగా దెబ్బతినడంతో మరమ్మతులు చేశారు. వంతెన కింద ఇసుకను తోడేయడంతో ఈసారి వరదలు వస్తే వంతెన కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

నీవా నది వంతెన సమీపంలోనూ తవ్వేసిన ఇసుక

